ధర్మారావుగారు తీసుకోలేదు. కాని ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. కూర్చున్నాక మంగపతిని ఎగాదిగా చూచేరు. చూసిన అతనికి జాలేసింది. ఒక మనిసి తలనొప్పి మీద ఇంత మంది బతుకులు ఆధారపడ్డాయా?

వాటే పిటీ?

చూడండి. మీ పేరేమిటన్నారూ?

చెప్పేడు మంగపతి.

మంగపతి గారూ మీరనవసరంగా హైరానపడకండి. మీరెవ్వరూ నాకేం ఋణం లేరు. ఆవిడకే జబ్బూ లేదు. డబ్బు ఎక్కువైపోవడం తప్ప నేనిచ్చినవి రెండు శాకరీన్ టాబ్లెట్లు. ఇంతకీ నేను డాక్టర్ని కాను యూనివర్శిటీలో బోటెనీ ప్రొఫెసర్ని, శలవలకని వచ్చేను. అంటూ కవరు తీసి మంగపతి జేబులో పెట్టేశారు డాక్టర్ ధర్మారావు ఎం.ఎస్.సి.పి; హెచ్.డి.

**(విజయ, 1.5.1976)**

# పూజా ఫలం

**ప్ర**తి ప్రాణి పుట్టింది మొదలు గిట్టే వరకు ఏవో పనులు చేస్తూనే వుంటుంది. ఆ పనులు సాధారణంగా ప్రకృతి పోసిన ప్రాణాన్ని పెంచుకుందామనో సొమాటిక్ (Somatic) లేక తన తదనంతరం తన ప్రాణాన్ని తనవారికి పంచి యిద్దామనో రీప్రొడక్టివ్ (Reproductive) జరుగుతాయి.

అయితే ప్రకృతి నుంచి మేధస్సును తానే ప్రత్యేకంగా పుణికి పుచ్చుకున్న మానవుడు మాత్రం అంతటితో తృప్తి పడడు, తన మానసికోల్లాసం కోసం కొన్ని ఆశలు, వాటి చుట్టూ మమకారాలు పెంచుకుంటాడు. అవి తీరని తరుణంలో, తన్ను తాను తమాయించుకునే ప్రయత్నంలో ఓ ఔట్‌లెట్ ఫెనోమినా (Outlet phenomena) గా పక్కదార్లు పడతాడు. ఈ పక్కదాట్లు బతుకు భారంతో విసిగినప్పుడు. ఓ బూతు కబురు ప్రేరణతో ప్రారంభమై కలం సాగనప్పుడో సిగరెట్టు వెలిగించడంతో ఆరంభమై యింకా స్తోమత వుంటే బాధానివృత్తి నెపంతో ఓ బీరు బిగించడం లేదా నల్లమందు నిద్రలో కలలు కనడం వగైరాలుగా వృద్ధి చెంతుతాయి. ఇవి పక్కదాట్లలో కొన్ని మాత్రమే. ఈ పక్కదాట్లూ, వాటి ఫలితాలూ శాశ్వతాలు కావు. మోతాదు మించితే సమర్థనీయాలు అంతకంటే కావు. సీసాలో పాలు అయిపోయిన తర్వాత పసిపిల్ల నోట్లో పీకలాంటివి. యివి తాత్కాలికంగా ఏదో ఏడుపుని ఆపగలవేగాని, అసలైన ఆరోగ్యానికివి ఎంత మాత్రం మంచివి కావు. ఎక్స్‌ట్రనల్ స్ట్రగుల్ (external struggle) తో నిలిచి నిలబడ లేనప్పుడు నిలిచి నిలబడలేనప్పుడు ఇంటర్నల్ డిజైర్స్ (internal designs) అణచు కోలేనప్పుడు, వాటి మధ్య పడి మనిషి నలిగిపోతూ వుంటే ఏ ఔట్‌లెట్ (outlet) అందకుండా వుంటే, ఇలాంటివే ఎమోషనల్ ఔట్ బరస్ట్స్ (emotional out bursts) గా బైటపడతాయి. వీటికే డాక్టర్లు హిస్టీరియా అనీ, సైకోసిస్‌లనీ రకరకాల పేర్లు పెట్టి, వీళ్ళు కట్టే ఊహా సౌధాల నుంచి ప్రతినెలా అద్దెలు వసూలు చేసుకుంటూ ఉంటారు.

అనుకున్న ఆశయాలు అందుకోలేనప్పుడు తెంచుకున్న ఆశలు తుంచుకోలేనప్పుడు అందని ద్రాక్షలు పుల్లన అని వదిలేస్తారు కొందరు. కాని, ఎప్పటికైనా అవి అందవా, అప్పుడైనా అవి తియ్యగా ఉండవా అన్న ఆశతో పరిసరాల్ని మరచి, నేల విడిచి, నింగికి ఎగురుతూనే ఉంటారు. అలా భూమ్మీదే ఉండి స్వర్గాన్ని కెగిరే ప్రయత్నాల్లోదే ఒకటి 'పూజ'లేక 'ఆరాధన'.

ప్రతి పనికి ఏదో ఒక ఫలం ఉంటుంది. మంచో, చెడో, ఫలం మంచిదై, పరిపక్వమైతే ఆరగించి ఆనందించవచ్చు. అదే ఏ చెక్క చెట్టుకో చెక్కుకున్న కాయలైతే, అవి ఎంత మంచివైనా చూపుల్తో రుచి చూడాల్సిందే తప్ప చేతికందిరావు. ఆ ఆర్టు కేవలం తత్త్వవేత్తలకే పరిమితం. సామాన్యులకది అసామాన్యం, అనూహ్యం, అనవసరం కూడా.

పూజాపునస్కారాలు గంతులేస్తూ కోలాహలంగా చేసినా, చతికిలబడి సమాధిలో వుండి చేసినా వాటి ఉద్దేశ్యం మాత్రం కాస్సేపు ఈ లోకం, అంటే నిప్పుల్లా కాలుస్తున్న ఈ నిజాలు కనిపించకుండా కళ్ళు మూసుకోవడమే. అంచేత నిజం చెప్పాలంటే యిదొక రకమైన ఎస్‌కేపిజమ్ (escapism) లాంటిది ఎస్‌కేపిజమ్ అయితేనేం మరో ఇజమ్ అయితేనేం ఇందులో కొంత రియలిజమ్ కూడా లేకపో లేదు. ఎంచేతంటే వాటివల్ల కూడా కొన్ని ఫలితాలు కనిపిస్తున్నా యని నాడు –నేడూ కొందరు అడపాతడపా చెప్తూనే ఉన్నారు కనుక :

ఈ రకమైన రసాల్ని ఆస్వాదిస్తూ బతికేదే ఈ కథలోని విశాలాక్షి.

విశాలాక్షి ఊదొత్తులు వెలిగించింది.

గది అందమైన లేదా ఊదా చీకటిలో, ఊదొత్తుల పొగ చలాకీగా సిల్కు మేఘంలా లేచి, "కృష్ణుడి" వెనుక నిలబడింది. మరొకపొర నల్లవాడి వక్షం మీదుగా భుజం మీదుగా పాకి తలునేసిన వింతవాణీగా నిలబడింది.

స్వామి ఎంతో మనోహరంగా ఉన్నాడు !

అందుకేనేమో భక్తితో పాటు, అంతమంది గోపికలు ...

అప్రయత్నంగా తన ఎర్రటి పెదవుల మీదకు తేలిన చిరు నవ్వుని పంటితో పట్టుకుంది విశాలాక్షి.

ఆమెకు నలభై వెళ్ళేయి. చిన్నప్పటి నుంచీ ఆమెకు భక్తి ఎక్కువ. తనని నమ్ముకున్న వాళ్లెవరికీ భగవంతుడు ఐహికంగా ఇబ్బంది పెట్టడు. ఒకవేళ పెట్టినా తప్పు భక్తుడిదే గాని భగవంతుడిది కాదు. కిందటి జన్మలో ఎవరు ఏం చేశారో? మనం చేసింది ఫలిస్తే అంతా మన ప్రజ్ఞ అను కుంటాం తప్పితే దేముడి తప్పు అంటాం. ఇంతకూ చేసేది ఎవరు? చేయించేది ఎవరు? ఈ జ్ఞానం లేకే మనుషులు తమ బతుకులు నరకప్రాయం చేసుకుంటారు. కష్టాలు పెట్టేదే భగవంతుడనుకుంటారు గాని అనుభవించేది కూడా మనలో వున్న ఆ మహానుభావుడేనని తను పెట్టిన కష్టాలు అనుభవించేది కూడా అతనే అని ఎందుకు గ్రహించరు?

ఆమె మాత్రం భగవంతుణ్ని అతి చిన్నప్పటి నుంచి నమ్మింది. గుడ్డిగా నమ్మింది. దీనిని మూఢభక్తి అనేది పక్కింటి రాముడు చిన్నప్పుడు.

నిజమే. తనది మూఢభక్తే. ఆ మూఢ భక్తికే ఆ దయామయుడు అనుగ్రహించి...

అప్పుడు.... యింకో నెలకో, రెణ్ణెలకో... పెద్ద దౌతుందనగా ... ఎస్సెల్సీ అపియర్ (appear) అయిన తన భావ (సన్నగా, నాజూగ్గా ఎంతందంగా ఉండేవాడు) తనింటికి వచ్చేడు. అతనలా రావడం కొత్తేమీ కాదు. సంవత్సరానికో, ఆర్నెల్లకో వస్తూనే ఉంటాడు. కాని ఆ మారు మాత్రం.

అతను నవ్వితే దోసెడు పువ్వులు ఘల్లున నేలని పడినట్టుండేది. నుదిటి మీదకు జారిన అతని రింగులజుట్టులోకి తన వేళ్ళు పోనిచ్చి అతని నల్లని జుత్తులో తన వేళ్ళెంత తెల్లగా కనిపిస్తాయో అతన్ని గుండెకి అదుము కొని కొరికెయ్యాలనిపించే అతని బుగ్గలు.

ఆ వేళకి సంక్రాంతి మూడు రోజులుంది. తను కళ్ళు మూసుకొని తలంటు పోసుకుంటోంది. వేపచెట్టు పక్కనున్న తడకల బాత్‌రూంలో, చెంబుడు నీళ్ళు నెత్తిన పోసుకొని కళ్లు విప్పేసరికి సరదాకి గడ్డివాము ఎక్కినట్టు ఎక్కిన తన పట్నం బావ తనకేదీ తెలీదన్నట్లు వాము మీంచి కిందకి జారుతూ కనిపించినప్పుడు సిగ్గుతో ముడుచుపోయి, కుచించుకుపోయి అలాగే భూమిలోకి కూరుకు పోవాలనిపించినా – వెంటనే – తన గుండెలో కదిలిన లేత అలలూ – వినిపించిన వింత సంగీతం నెమలి కాళ్ళ మువ్వల రవళీ....

ఆ సాయంత్రం...

గుళ్ళో గంటలచప్పుడు పూర్తిగా కరిగిపోకముందే గర్భగుడిలో ఉన్న ఒక్క దీపం చీలుస్తున్న చీకటిలోంచి స్వామిని తను చూస్తుండగా – ఆచారిగారు అప్పుడే ఏం తొందరే అని ప్రేమనే కొంటెతనంగా మార్చుకుని అన్నప్పుడు, స్వామి తనని చూసి చిరునవ్వు నవ్వలేదా?

ఏ ప్రమాణం చెయ్యమన్నా చేస్తుంది తను. స్వామి నవ్వు తను స్పష్టంగా చూసింది. ఇప్పటికీ ఆ నవ్వు యింకా తన కళ్ళలో కదుల్తూనే ఉంది. ఈ కలికాలంలో ఎంత భక్తి వుంటే మాత్రం భగవంతుడు అంతకంటే సాక్షాత్కరిస్తాడా?

అతను కనికరించడమే కనిపించడం.

అతను ఎంత కనికరించకపోతే – బోలెడు కట్నం యిస్తానన్న తన పెత్తల్లి కూతురు కమలని కాలదన్ని, తననే చేసుకుంటారని రఘు – అంటే బావ పట్టుబడతాడా

అతను ఎంత కనికరించకపోతే –

పువ్వుల్లో రాత్రి తన ఆనందభాష్పాలు దాచుకుంటున్న సమయం–బావ తనమెళ్ళో తాళి కడతాడా? తాళికడితే మాత్రం. తొలినాటి రాత్రి చూసినట్టే ఈ పాతికేళ్ళ తరువాత కూడా–పువ్వులు విడిన శబ్దానికే తను బెదిరిపోతుందేమోనన్నంత అపురూపంగా చూసాడా?

పెళ్ళైన ఆర్నెల్లకే రఘు మొదటి ఉద్యోగం ఇంటర్వ్యూకి వెళ్తున్నప్పుడు తను స్వామికి సాష్టాంగపడి స్వామీ! తండ్రి పోయిన కన్నతండ్రిలా ఉన్న నిన్ను తప్ప ఎవ్వరినీ ఏమీ అడగలేదు–ఈ ఉద్యోగం" ప్రార్థన పూర్తయి లేస్తున్న ప్పుడు ఆ దయామయుడు తన మెడలో ఉన్న దండలోని గులాబీ తన తలమీద

దీవెనతో వెయ్యలేదా? దీవన వృథా అయిందా? ఎందరో రిక మెండేషను వాళ్ళుండగా వాళ్ళకి కాకుండా తన రఘుకే ఆ ఉద్యోగం రాలేదా?

మొదటి జీతంతో ముత్యం ఉంగరంకొని తన సన్నని వేలుకి వెన్నెల్లో తొడుగుతున్నప్పుడు ముత్యం నీలి జీర తన కళ్ళ చివర వెన్నెల వెదజల్లినప్పుడు - తను ఈ ముత్యంలాంటి ... అను కున్న తొమ్మిది నెలలకే కోరుకున్న "అమ్మ"నే కనలేదా?

తనున్నానని ఇంతకంటే నిదర్శనం ఏం చూపిస్తాడు ఆ సర్వాంతర్యామి?

అయినా తన బతుకంతా ఆ స్వామి ముత్యాల ముగ్గులు పెట్టలేదు. రత్నాల కంబళ్ళు పరవలేదు. ఐదేళ్ళు వచ్చేవరకు చేతుల్లోంచి దించకుండా, అతి ముద్దుగా పెంచిన తన పెద్ద కూతరు పద్మని, తెలియక తాగుబోతు మొగుడికి కట్టబెట్టిన పది నెలలకే అతని అరుపులూ, కరుపులూ పడలేక కిరస నాయిలు మంటలు పొగల్లో ఊపిరి సలపక అదివరకే మనసు కాలినంత వళ్ళు కూడా కాలి బొగ్గయి బుగ్గయి పోయిన్నాదు - తను అజ్ఞానంతో, మమకారపు పొరలవల్ల కలిగిన అంధ కారంలో "ఏమిటి స్వామీ! ఈ అన్యాయం?" అని నిలదీసింది. కడుపుమంట చల్లారి ఆవేశం అంతం అయ్యేక కాని పద్మ కిందటి జన్మలో ఏ పుచ్చిన పువ్వులు పూజ చేసిందో, ఏ కుళ్ళిన పళ్ళు నైవేద్యం పెట్టిందో? అన్న వికాసం తనకు కలగలేదు.

తనకి అతను ఎప్పుడూ ప్రత్యక్షం కాలేదు. అలాగని పూర్తిగా కనిపించడం మానెయ్యనూ లేదు. తరచూ కలల్లో ప్రపంచం అంతా నల్లమందు నీళ్ళు జల్లిన రాత్రిళ్ళూ-వెండికలల్లో గులాభీ ధూళిలో తన ప్రభువు తనకి కనిపిస్తూనే ఉన్నాడు. తను మేలు కొని వుండగా-తన తేలకళ్ళు పూర్తిగా తెరుచుకొని ఉన్నప్పుడు కాకపోయినా .... ఆఖరికి క్రీగంట అయినా.... వెనుదిరిగివున్న ఆ దయామయుడిని ఒక్కసారి ఒకేసారి దూరంగా అయినా అస్పష్టంగా అయినా కనిపించవా బాబూ!

తనకి ఏమిటవుతున్నాది? ఏమిటైపోతున్నాది? ఏమిటి తనలో ఈ వింత మార్పు... తన శరీరం ఎండుటాకులా గాలిలో తేలిపోతున్నాది. కళ్ళు తెంచిది.

తన ఇల్లు కాదు, తన గది కాదు.

ఎక్కడిదీ మంచి గంధపు జల్లు?

ఎక్కడిదీ జరీ భూమి?

ఎవరుఊదుతున్నారు ఈ వేయి వేణువులు?

ఎక్కడివీ ఊదా మేఘాలు...

చీకటి పడకుండానే ఎక్కడ నుంచొచ్చాయి ఈ చక్కని చుక్కలు...

ఆ నీలికొండ అంచున ఏవిటా పన్నీరు ఏరు...

వర్షం లేనిదే ఏవిటిన్ని ఇంద్ర ధనుస్సులు..

నేలా నింగీ కాని ఏదో వింత దేశం.

పగలూ రాత్రీ కాని దివ్య సమయం.

ఎండా వెన్నెలా కాని చల్లని కాంతి.

దూరంగా నిత్య యవ్వనులు గుంపులో ఆ చివర ఉన్నామె అచ్చు తన అమ్మలాగే ఉంది.

అమ్మా...

ఇంట్లోంచి పిల్లలు పిలుస్తున్నారు.

దూరంగా వస్తున్న దపంతులు.... రాధాసమేత...

అమ్మా మళ్ళీ ఇంట్లోంచి పిలుపు.

..నిన్న రామూ చెప్పేడు తన ఆఫీసు ఇంజనీరు యినస్పెక్ట్ చేస్తాడనీ, వేగం వంట చెయ్యమనీ,

నిన్ననే చెప్పింది చిన్న కూతురు కమల తన ప్లేబ్యాక్ సింగర్ (play back singer) జీవితంలో ఒక కొత్త మలుపు వచ్చిందనీ తనని ఎవరో సపోర్టింగ్ రోల్‌కి బుక్ చేసేరనీ-ఈ వేళ మొదటి షూటింగనీ, పిచ్చిది పాటే దాని ప్రాణం-రాగాలే దాని బతుకు రంగులు... ఇంట్లో అందరూ నిరుత్సాహపరచినా, తనే మ్యూజిక్ స్కూల్లో చేరి... తన పూజాఫలం కాకపోతే హైస్కూలు మ్యూజిక్ కాంపిటీషన్లో ఫస్ట్ వస్తే మాత్రం అంతా ప్లేబ్యాక్ సింగర్ (play-back singer) అవుతారా?

నిన్ననే చెప్పేడు ఆఖరివాడు సుబ్రమణ్యం - చదువులోనే కాకుండా స్పోర్ట్సులో కూడా తనే ఫస్ట్ అనీ రేపే తనని ఇంటర్ యూనివర్శిటీ గేమ్స్‌కు ఏదో ఊరు తీసుకు వెళ్తారని.

కాని యివ్వకివ్వక దర్శనం యిస్తున్న తన ప్రభువు దర్శనం పూర్తికాకుండానే ఎలా వెళ్ళడం? అందుకే అంటారు సంసారం ....

అమ్మా!

అమ్మా! అమ్మా!

అమ్మా!

తనను ఎవరో బలవంతంగా కుదిపేసరికి ఆమె కళ్ళు విప్పింది.

గది బైటకు వచ్చింది. తను పూజలో ఉండగా ఇన్నూ మిన్ను చుట్టవెడుతూ ఎక్కడి నుంచి వచ్చేయో ఈ చీకటి మేఘాలు.

అక్కడో పాకా, ఇక్కడో పందిరీ కాకుండా కోటలు, కట్టలూ, గుళ్ళూ, గోపురాలూ కదిపి కుదిపి విసిరెయ్య డానికే వచ్చినట్టున్న ఈ గాలి ఎక్కడినుంచి వచ్చిందో.

పట్టపగలే ఎక్కడి నుంచి చుట్టపెట్టేసిందో ఈ గరళపు చీకటి.

నీది పూజా? నిద్రా? కుక్కి మంచంలో దగ్గలేని రఘు వంకర పెదిమలలోనే విరిగిపోయేయి ఆ మాటలు. అతను మేష్టరు పనిచేసేక ఎందుకు రిటైరయ్యేడో ఎందుకు చచ్చిపోలేదో అని పీక పట్టుకొని అడుగుతాడేమోనన్న భయంకొద్దీ భగవంతుడు అతనికి కనిపించడం మానేశాడు.

ఇంజినీరు అవుదామని ఆశపడి, అదృష్టం కొద్దీ ఇంజనీరు మేస్త్రీ అయిన రామూకి భోజనం తీసికెళ్లడానికి వచ్చిన కేరియర్ల పిల్ల అలాగే నిలబడిపోయింది.

ప్లేబ్యాక్ సింగర్ (playback singer) అవుదామనుకుని సినిమాలు చూసే అదృష్టానికి అయినా నోచుకోకపోయినా, తనకిక పెళ్ళి చేయలేరన్న జ్ఞానం సంపాదించుకున్న కమల మధ్యాహ్నం భోజనానికి వచ్చిన పక్కింటి మిల్లు డ్రైవరుకి మరోటీ మరోటీ ముద్దులు యిచ్చి పరుగెత్తుకు వస్తోంది.

తనని మళ్ళీ పోలీసు స్టేషనుకి రమ్మని కబురు పెట్టేరని తన తల్లికి ఎలా తెలియకుండా వుంచడమా అని ఆలోచిస్తున్న మణి ఆమెను చూసి చేతిలో వున్న బీడి పారేశాడు.

"అయ్యో వర్షమే కమలా అంటూ" ఆరేసిన తన రెండో చీర వేపు పరిగెత్తింది విశాలాక్షి.

**(ఆంధ్రజ్యోతి, వారపత్రిక 9.7.1976)**

# బస్సు కదిలింది

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది.

నడివయసు సూర్యుడు నిప్పుతో చెలగాటాలాడుతున్నాడు.

మనిషి నిలువునా తగలబడిపోతాడేమోనన్నంత వేడిగా వుంది.

జోళ్ళున్నా కాళ్ళు కాలిపోతున్నాయి.

ఆకలికి కడుపు కాలిపోతోంది.

ఎండకీ, ఆలోచనలకీ బుర్ర కాలిపోతోంది!

మా వారి మీద కోపంతో గుండె కాలిపోతోంది.

మొత్తానికి నేనొక అగ్నిపర్వతంలా వున్నాను. "ఇంత ఎండలో బస్సు ప్రయాణవేఁవిఁటే, నా మొహం" విసుక్కున్నాడు శ్రీను. వాడికి బస్సంటే భయం. ఎండంటే ఎలర్జీ. కాని మా వారి మాట సుగ్రీవాజ్ఞ. ఏ భయం అయినా, ఎన్ని ఎలర్జీలైనా ఆయన మాటకి లొంగాల్సిందే. ఈయన క్రితం జన్మలో హిట్లరో, ముసోలినీనో అయివుంటారని నా గట్టినమ్మకం. "అభిజిత్ లగ్నం అమోఘమైనది. ఏ పనికైనా తిరుగుండదు"–మా మావఁగారి ఉవాచ.

నాకు నవ్వొచ్చింది. అంత పెద్ద పేరెందుకూ, ఉప్పరి లగ్నం అంటే సరిపోదా? ఇంతకీ అది ఎంత అమోఘమైన దైన నడి రోడ్డు మీద నిల్చోడానికి మాత్రం కాదు. కాని ఏం చేస్తాం. మా వారు హిట్లరు అవునో కాదోకాని ఈయన మాత్రం సాక్షాత్తు హిరణ్యకశిపుడే.

వేసవికాలం మధ్యాహ్నం పన్నెండు గంటలకి బస్సు కోసం వెయిట్ చెయ్యడానికి యింకే శిక్షా సాటిరాదు.

ఎదురుగా గోడమీద కూర్చున్న కాకిపిల్ల–నోరెండి పోయిందేమో–నా నుదిటి మీద నుంచి కారిన చమట వేపు ఆశగా చూస్తోంది. పక్కనే సోడాబండి కింద కారుతున్న నీటిలో రెండు పిచ్చికలు సరిగంగ స్నానాలు చేస్తున్నాయి.

ఈవేళ, రేపు ఏదైనా లగ్నం వుందా? ఏఁవిఁటీ జనం?

"ఈ జనమంతా మన బస్సుకే!" పైకే ఆశ్చర్యపోయేను. "కాదు. ఆర్.టి.సి. బస్సుకి" అన్నాడు శ్రీను. వెధవ కుళ్ళు జోకులూ వీడూను.

"కొన్నాళ్ళు వారపత్రికలు చదవటం మానీరా" అనే దాన్ని యింకొకప్పుడైతే. కాని యిప్పుడీ ఎండలో ఏవఁనిపించలేదు